


# నవజీవనం

పింగళ్ళ రామచంద్రమూర్తి

త్యాగం అన్నిటినీ మించిన ధర్మం. మరి, పరోపకారపారీణులు, విషయ వాంఛావిరక్తులు, ధర్మపరులు అయిన రామనాథంగారు "ఇతరుల కోసం త్యాగం చెయ్యడంతో పాటు మన కోసం ఇతరులు ఏపాటి త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నారు అని ఆలోచించావా" అని చెబుతారేమిః ఇప్పుడు సావిత్రి కర్తవ్యం ఏమిటి ?

---

రావుబహద్దూరు రామనాథం గారు పరమ పదించారు !

చెట్టున పండిన పండు నేల పడటం ఎంత సహజమో, గర్భస్థ శిశువు బయటకు రావటం ఎంత తప్పని విషయమో, చల్లదనం తగిలిన నల్లమబ్బు వర్షించడం ఎంత సంభవమో—అంతఃసహజమయినది గానూ, ప్రకృతి విధించిన నిబంధనల్లో ఒకటిగానూ స్వీకరించారు ఆయన మరణాన్ని బంధువులూ, మిగిలి ఉన్న మిత్రులూ.

''ఆయనకేం పుణ్యపురుషుడు—పూర్ణాయుష్కుడు. మూడు పాతికలు దాటాడు. లేకపోతే ఆయన చేసిన తప్పల్లా—'' అన్నారు.

ఆయన భార్య మటుకు మనఃపూర్వకంగా వివాహించింది. బంధువుల దృష్టిలో అవిడే ఆయన చేసిన పెద్ద తప్పు. ఆ తప్పు పేరు సావిత్రి!

షష్టిపూర్తి చేసుకుని రెండేండ్లు దాటిన రామనాథంగారిని చేసుకునేందుకు సావిత్రి అంగీకరించిందని విని ఆశ్చర్యపోయారు ఆమె స్నేహితురాండ్రు. ఆమె కూడా ముక్కుపచ్చలారని దేమీ కాదు. అదే వారిని ఆశ్చర్యపెట్టడానికి కారణం కూడా!

"చదువుకున్నది—చూస్తూ చూస్తూ ఎలా ఒప్పుకున్నది" అని.

"పెళ్లి కాదని భయపడ్డావా సావిత్రీ—తలిస్తుండి కూడా గొంతుక్కోసుకుంటున్నావు? నిజంగా పెళ్లికోసం తపన పడుతున్న దాని వయితే ఈ పెళ్లి, వలన లాభం ఏమిటి? ఆయన వయస్సు తెలుసా?"

"తెలుసు—నా వయస్సుకు సరిగా మూడు రెట్లు" అంది పేలవంగా నవ్వుతూ సావిత్రి.

"అయితే అన్నీ తెలిసి కూడా నీకై నువ్వు ఒప్పుకున్నావంటే అది కేవలం ఆయన వెనక.." మాట పూర్తి చేయకుండానే ఆపేసింది నళిని.

అయినా సావిత్రి అందుకుని "ఆపేశావేం నళినీ—కేవలం ఆయన ఆస్తిని చూసే!" అంది గంభీరంగా.

మారు మాట్లాడ లేకపోయింది నళిని.

"చూడు సావిత్రీ, మీనాన్న పక్షవాతంతో మంచానికి అతుక్కుపోయారు. చెల్లాయి అప్పుడే పెద్దమనిషయి అయిదేళ్ళయింది. నీ మట్టుకు నీకు ఇరవయి దాటినా ఒకింటి దాన్ని చేసే దిక్కు లేదు. అన్నయ్యకు ఉద్యోగం పోయి వాడు నానా యాతనలూ పడి చివరికి పిల్లలతో సహా మీనాన్న రెక్కలమీద బ్రతుకుదామని మనింటికి చేరాడు. ఉన్న ఇల్లు అమ్ముకున్నా అది హారతి కర్పూరంలా హరించిపోయింది! తమ్ముడు కాలేజీలో చేరతానని ఒకటే ఏడుపు." ప్రస్తుత పరిస్థితిని తల్లి ఏకరువు పెడుతూంటే తమ పరిస్థితికి కాళ్ళు చల్లబడిపోయాయి సావిత్రికి. నిత్యం అనుభవిస్తున్నదే మరి ఒకరి నోటి వెంట వినడం. "ముందు ఏంగతి ఏమిటన్న" ప్రశ్న దరిలేని సముద్రంలా ప్రత్యక్షమయింది.

ఆ ప్రశ్నే తల్లి వేయంగానే వణికిపోయింది సావిత్రి.

"ఈ పరిస్థితుల్లో మనం కోరని వరంలా పేదకు పెన్నిధిలా వచ్చింది తల్లీ, ఈ అవకాశం. దీనితో మన గృహచ్ఛిద్రాలన్నీ సమసిపోతాయి. నాన్నకు మందిప్పించి ఆయన్ని తిరిగి ఎప్పటిలా చేయించవచ్చు. ఇంట్లో సమస్య అన్నది మచ్చుకయినా ఉండదు!" అని ఆవిడ అంటూంటే సావిత్రి కామాటలు అమృతప్రాయంగా తోచి—

"ఏమిటమ్మా అది?" అనడిగింది ఆత్రంగా.

ఆవిడ కొంచెం తటపటాయించింది. "నీ మీదే ఆధారపడి ఉంది మన కుటుంబం భవి

# నవ జీవనం

ష్యత్తు!" అంది.

తనమీదనా? తెల్లపోయింది సావిత్రి. తనంత శక్తిమంతురాలా?

"ఆయనకు ఊళ్లో పెద్ద మేడ ఉంది. కారు ఉంది. మూడు వందల ఎకరాల పొలం ఉంది. బ్యాంకుల్లోనూ, కంపెనీలోనూ కలిసి పది లక్షలదాకా నిలవ ఉందంటారు. వీటన్నిటి మీదా ఆయనకు సంవత్సరానికి మూడు నాలుగు లక్షల ఆదాయం వస్తుంది!" అని ఈ 'లక్షల' ప్రభావం కూతురుమీద ఎంతవరకు పనిచేసిందో చూసేందుకు ఆగి, "ఆయన నిన్ను చేసుకునేందుకు కబురు చేశాడు. మన కుటుంబాన్ని పోషిస్తానని కూడా అన్నాడు" అన్నది.

"ఎవరాయన?" అనడిగింది ఆశ్చర్యంగా సావిత్రి.

అంతవరకు వాయిదా వేస్తూ వచ్చిన ఆయన పేరు ఇక చెప్పక తప్పలేదు ఆవిడకు. "రావు బహదూర్ రామనాథంగారు! నిన్ను మీ కాలేజీలో చూశాట్ట. మన కుటుంబ పరిస్థితిని కనుక్కున్నాడట—నిన్న కబురు చేశాడు" అంది.

"రామనాథంగారా? ఆదేవిటమ్మా, ఆయనకు షష్టిపూర్తి కూడా జరిగి చాలా రోజులయింది తెలుసా?"

"అవునమ్మాయ్—లేకపోతే అసలు మనలాంటి వాళ్ళు ఆయన దగ్గరకైనా వెళ్ల గలరా? ఆలోపం ఒకటి ఉండబట్టి. ఇది నీ గొంతు కోయడమే— కాదనను. కాని నీతోడబుట్టిన వారికి రెండు పూటలా ఇంత అన్నం దొరకాలంటే, వాళ్ళు బాగు పడాలంటే—ఇది మనకు మంచి అవకాశం తల్లి! మీ నాన్నను చూడు. అసలాయన జబ్బుకు సగం మనోవ్యాధే కారణం. ఎదిగిన కూతురు రొమ్ములమీది కుంపటిలాంటిది! ఆలోచించు. మీ కుటుంబం కోసం ఆ మాత్రం త్యాగం చేయలేవా?" అంది ఆవిడ

మొదట ఆ మాటలకు సావిత్రికి కోపం వచ్చింది. ఎందుకు త్యాగం చేయాలి? జీవితమంతా ఎందుకు నాశనం చేసుకోవాలి? స్కాలర్షిప్ మీద ఇంటర్ దాకా చదువుకున్నది తను. ఎక్కడో ఉద్యోగం దొరక్కపోదు. [illegible] తను పోసుకోలేకపోదు! అనుకుంది ఆ ఉద్రేకంలో.

కాని అంతలోనే ఆమెలోని [illegible] కళ్ళు తెరిచింది. తన జన్మకి కారకులైన తలిదండ్రులకు సాధ్యమైనంత సాయపడటం తన ధర్మం. రెక్కలొచ్చాయి కదా అని ఎవరి దారిన వారు పోతే తమ శక్తినంతా పిల్లలకు ధారపోసిన వారిగతి ఏంకాను? కాబట్టి తనకు వివాహం అయి ఇంకొకరి 'సొత్తు' అయ్యేదాకా ఇంటికోసం పాటుపడటం తన కనీస కర్తవ్యం.

ఉద్యోగం-చేసి పోషించవచ్చు. కాని పెద్ద పెద్ద చదువులు చదివిన వారికే గతిలేని ఈ రోజుల్లో ఇంటర్ యోగ్యతమాత్రం గల తన ముఖం చూసేదెవరు? అథవా ఎక్కడైనా దొరికినా అందులో వచ్చే జీతం ఎంత? అది తమ కుటుంబానికి ఎన్నాళ్లో జాలు వస్తుంది?

ఇక పోతే పెండ్లి. తనంత తాను ఎవరినో ప్రేమించి పెళ్లిచేసుకునేపాటి చొరవ, ధైర్యం తనలో లేవు. కాబట్టి ఏనాటికైనా ఈ విషయం పరిష్కరించవలసినవారు పెద్దవాళ్ళే. తామున్న ఈ పరిస్థితుల్లో వాళ్ళు తననూ ఒకింటి దాన్ని చేయగలరా? అందుకు కావలసిన డబ్బు జతపరచ గలగడం కలలోని మాట. ఏనాటికైనా తనకు రెండవ పెళ్లివారు తప్పరు. చిన్నవాళ్లను తీసుకు రాగలిగినా ఏదో లోపం లేనిదే వాళ్ళు తమకు అందుబాటులోకి రారు. ఎవడో తన కన్న బీదవాడిని పట్టుకుని బాధలు పడే కన్న తన స్వార్థం విస్మరించి ఈయన్ని చేసుకుంటే కనీసం కుటుంబం కోసం త్యాగం చేశామన్న సంతృప్తి అయినా మిగులుతుందిగా? తమ కుటుంబం బాధ్యత తను స్వీకరిస్తానని అన్నాడుట. . . .

ఇన్నీ ఆలోచించి ఆనాడు ఈ వివాహానికి అంగీకరించింది సావిత్రి. "మీ ఇష్టం" అన్న ఆ మాటలకు వెనక ఎంత ఆత్మసంఘర్షణ జరిగిందో, ఎంతటి కఠోరనిశ్చయమో అది ఎవరు గ్రహించేవారు? ఎన్ని కన్నీళ్ళు మూగగా కార్చిందో గమనించేవారెవరు?

"డబ్బు, కారు, హోదా చూసింది" అన్నారు ఈర్ష్యగా బయటి వాళ్ళు.

"అమ్మ, ఈ భారం తీరింది" అని ర్నారు ఇంట్లో వాళ్ళుఒక— దెబ్బతో సమస్యలు తీర్చామన్న సంతృప్తితో.

గదిలో మొదటి రోజున—

"డబ్బును ఎరగా చూపెట్టి నాస్వార్థం కోసం నీజీవితాన్ని నాశనం చేశాను సావిత్రీ, నన్ను క్షమించగలవా?" అన్నారు రామనాథంగారు జాలిగా.

తన మనస్సులోని బాధను గ్రహించినట్లుగా అన్న ఆయన మాటలకు ద్రవించిపోయింది సావిత్రి. ఇటువంటి అనునయ పూర్వక మధుర మాట వస్తుందని కలలో కూడా అనుకోలే

## మిగిలింది!

ఇంటి యజమాని: "నువ్వు అన్నం తింటావా? గడ్డి తింటావా? ఏ పని చెప్పినా సరిగా చేసి ఏడవ్వు."

నౌకరు: "మీరు తినగా మిగిలిందే నండీ."

—కోయల్‌కర్ బన్సీలాల్
(నిజామాబాద్)

దామె. . అదే ఆయనపట్ల ఆమె దృక్పథాన్ని మార్చింది.

"మీరేమీ దాయలేదుగా! తెలిసి చేసుకున్న దాంట్లో మీరు మోసం చేసిం దేముంది?'' అంది మెల్లిగా.

ఆ నాటినుంచీ ఆమె ఇంటి బాధ్యత స్వీకరించింది. ఇంటిలోని పనివాళ్లను కన్నబిడ్డలుగా చూచి వారి విశ్వాసాన్ని చూరగొంది. రామనాథం గారు కూడా ఆమె దగ్గర పసిపిల్లాడయి పోయాడు.

అక్కలుదాచే ఇనప్పెట్టె తాళాలు బొడ్లో దోపుకుని, కంచిపట్టుచీరలు కట్టుకుని ఆ మేడలో తిరుగుతుంటే సావిత్రినిచూసి "అదృష్టవంతురాలు'' అని ఈర్ష్య పడేవారిని చూసి నిర్జీవంగా నవ్వుకునేది.

ఈ రకంగా మూడు సంవత్సరాలు గడిచాయి. ఇద్దరు వ్యక్తులు ఒకే చూరుక్రింద కలిసి ఉండటాన్ని 'కాపురం' అనగలుగుతే సావిత్రి రామనాథం గారితో మూడేళ్లు కాపురం చేసింది. ఈ కాలంలో ఆయన పట్ల ఆమెకు గౌరవం అధికమయింది. ఆయన తన పరిస్థితిని సానుభూతితో అర్థంచేసుకోవడం మొదలిడి, ఇక రెండవది—

ఈ మూడు సంవత్సరాల్లోనూ సావిత్రి పుట్టింటి వారు ఆర్థికంగా పుంజుకున్నారు, ఉన్న అప్పులన్నీ తీరాయి. పెద్ద డాక్టరుకు ఖర్చు భరించటం, ఖరీదయిన మందులు కొనడం వల్ల సావిత్రి తండ్రికి జబ్బు కుదిరి చాలా మటుకు ఆరోగ్యంగా తిరుగుతున్నాడు. చివరికి సావిత్రి అన్నగారు శర్మ ఏదో వ్యాపారం పెట్టుకొనేందుకు కూడా రామనాథం గారు సాయపడ్డారు. సావిత్రి తమ్ముడు కాలేజీలో చదువుకుంటున్నాడు.

రామనాథం వంటి ఆస్తిపరుడికి ఇటువంటి ఖర్చులు ఒక లెఖ్ఖలోనివి కావని తెలిసినా సావిత్రి అప్పుడప్పుడు బాధపడుతూండేది—కేవలం తన ద్వారా ఆయన తన కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్నారని. అందులోనూ తన వాళ్లు ఆయన్ను డబ్బు అడిగే రీతి ఆమెకు నచ్చేది కాదు. తామేదో అడిగేందుకు హక్కు ఉండి అడుగుతున్నట్లుగా ఉం. వారి ప్రవర్తన.

ప్రథమంలో ఏదయినా డబ్బు అవసరం అయితే సావిత్రి ద్వారా అడిగించే వారు. కాని క్రమేణా వాళ్లే ఆయన్ను ఎదుటపడి అడగడం, ఆ అడిగినప్పుడు ఆయన చేతుల్లో లేకపోతే కోపాలు తెచ్చుకోవడం కూడా జరుగుతూండేది!

ఒకసారి సావిత్రికి కష్టంవేసి ఆయనతో అనేసింది కూడా—"మా వాళ్ల ప్రవర్తన నాకే అన్యాయంగా ఉంది. మీరు వాళ్లకు మరీ చనువు ఇస్తున్నా"రని.

దానికి ఆయన నవ్వి, "నీలాటిదాన్ని నా కిచ్చిన మీ వాళ్లకు నేనెంత ఋణపడి ఉన్నానో నీకు తెలియదు సావిత్రీ!'' అన్నాడు. ఆయన వితరణ, హృదయ వైశాల్యం ఆమెను సన్నిహితురాలిని చేసుకున్నాయి. ఆయన వలన తన జీవితం నాశనమయిందన్న భావాన్ని కలగనీయకుండా చేశాయి. అందుకే ఆయన పోయినప్పుడు చాలా ఆత్మీయుల్ని కోల్పోయినట్లు అనిపించింది సావిత్రికి.

రామనాథం పోయే ముందు సావిత్రిని గదిలోకి ఒంటరిగా పిలిచి—"నీకు మనస్సుకు కష్టం కలిగించే దయినా రెండు మాటలు చెప్పదలచుకున్నాను సావిత్రీ! నువ్వు చాలా అమాయకురాలివి. ఇతరులకోసం త్యాగం చేయడంతో పాటు మనకోసం ఇతరులు ఏపాటి త్యాగం చేయటానికి సిద్ధంగా ఉన్నారు అని ఆలోచించాలి. మీవాళ్లు కేవలం కుటుంబ భవిష్యత్తును ఆలోచించుకుని నిన్ను నాకు కట్టబెట్టారు. తనకన్న పెద్దవయసు వాడికి కాళ్లు కడిగి పిల్ల నిచ్చేందుకు మీనాన్న సందేహించకపోగా అది తను చేసిన తెలివిగల పనుల్లో ఒకటిగా భావించాడనుకుంటా! డబ్బుకోసం ,స్వార్థం కోసం ఒక జీవితాన్ని నాశనం చేసిన వాళ్లు మన కెంత ఆత్మీయులయినా ఆ డబ్బు పట్ల వాళ్ల ప్రవర్తనను కొంచెం కనిపెట్టి ఉండటం మంచిది.

"ఇక పోతే—ఇప్పుడు నీకు సరిగా పాతిక సంవత్సరా లను కుంటానువయస్సు. కాని ఆ వయస్సులో ఉండవలసిన సుఖం నీకు లేదు. అసలు నేను పెళ్లి చేసుకోకనేపోదును. కాని నాచుట్టూ కొన్ని గ్రహాలు చేరి నన్నీ పనికి దించాయి. నీ జీవితం నాశనం చేశాను. ఈ ఆస్తి అంతా నీకు చెందుతుంది. నాకుమటుకు నువ్వొక వాగ్దానంచేయాలి. మంచివాడు, ఉత్తమ ఆదర్శాలు కల వాడు తటస్థపడితే అతన్ని నువ్వు వివాహమాడుతానని!'' అన్నాడాయన.


సావిత్రి కలవర పడిపోయింది. "ఆవేం మాటలండీ—మీ వల్ల నా కేమీ అన్యాయం జరుగలేదు. ఎక్కడో మురికి కూపంలో పడి ఉండవలసిన నన్ను ఈ సుఖాల మధ్యకు తెచ్చారు. నా జీవితంలో ఎటువంటి అసంతృప్తీ లేదు'' అంది.

"అది కాదు సావిత్రీ—నా పాపానికి ప్రాయశ్చిత్తం జరగాలంటే, ఇతర లోకాల్లో నయినా నాకు మంచి గతులు కలగా లంటే నువ్వు పెళ్లి చేసుకోవాలి. లేకపోతే నా మనస్సుకు శాంతి ఉండదు. నువ్వు నాకీ వాగ్దానం ఇవ్వకపోతే ఆ అసంతృప్తితోనే పోతాను.''

ఆయన బలవంతంమీదనే వాగ్దానం చేసింది సావిత్రి.

పదకొండవ రోజు కర్మ యధావిధిగా జరిపించిన సావిత్రి తండ్రి "అమ్మాయ్, అన్నయ్యా వాళ్లకు కూడా రమ్మని రాశాను. నువ్విక్కడ, మేమక్కడ ఎందుకు? కలో గంజో కలిసే తిని బతుకుదాం'' అన్నాడు.

ఆ ప్రకారమే సావిత్రి అన్నగారు, వదిన గారు, చెల్లెళ్లు, తమ్ముళ్లు అందరూ ఆ ఇంటిలోనే దిగారు. రోజులు గడుస్తున్నాయి. సావిత్రి అన్న గారు శర్మ వ్యాపారం పెంచుతున్నానని నెలకు అయిదారు వేలు తీసుకుంటున్నాడు. అతను నిజంగా ఏం వ్యాపారం చేస్తున్నాడో



తన్మయత

చిత్రం — బి. శశి (ఠేకుసెట్టిపాలెం)

సావిత్రికి తెలియదు.

"ఇప్పుడంతా పెట్టుబడి స్టేజిలో ఉంగమ్మాయ్. తరువాత తరువాత లాభాలు కొల్లలుగా వచ్చేస్తాయి'' అన్నాడు శర్మ ఒక రోజు సావిత్రి ఇంతడబ్బు ఏం చేస్తున్నా వన్నయ్యా అంటే.

"నీ డబ్బుకు అంతా లెక్క రాసే ఉంచాను లేవమ్మా—అప్పుకిందే తీసుకుంటున్నాము. ఏదో నీ చేతిక్రింద బతుకుతున్నా మాకూ నీతీ నిజాయితీ ఉన్నాయి'' అంది సరోజ—శర్మ భార్య.

సావిత్రికి కష్టమేసింది. తనన్న మాటేమిటి? దీనికి ఆవిడ వ్యాఖ్యానం ఏమిటి? "అదికా దొదినా, ఇప్పు డిదంతా మీది కాదా?'' అంది బాధగా.

"ఆ, అంత స్వతంత్రముగా చనువూ ఉంటే ప్రతిసారీ విన్నడగలేక ఆయన సిగ్గుపడటం ఎందుకొస్తుంది? సగం చచ్చి అడుగుతారాయన డబ్బు—అసలే ఆయనకు అభిమానం జాస్తి.''

"పోనీ తాళాలు అన్నయ్య దగ్గరే ఉండనీయ్ వదినా—నాకూ బరువుగానేఉంది'' అంటూ తాళం చెవులు తీసి అన్నగారికిచ్చింది.

"ఎందుకులే—అడుగుతాగా'' అంటూనే తీసుకున్నాడు.

ఆ తీసుకున్నప్పుడే అతని ముఖంలో వెలిగే ఆనందంగమనించి తృప్తిగా నిట్టూర్చింది సావిత్రి. "ఎక్కడ పోట్లాటలొచ్చినా డబ్బు మూలంగానే'' అనుకుంది మనస్సులో.

ఇప్పుడు ఇంటి అజమాయిషీ అంతా శర్మది, అతని భార్యది. సావిత్రి ఏమీ పట్టనట్లు, ఆ ఇల్లు తనది కానట్లు ఎప్పుడూ లైబ్రరీ గదిలో కూర్చుని చదువుకోసాగింది. ఈ మార్పు ఇంట్లో వారి కంటరికీ నచ్చింది.

లేకపోతే దీనికి [illegible]తున్న వాళ్లమట్టుకు

# నవ జీవనం

ఇంటిలో పని వాళ్ళ- శర్మకు పెత్తనం రాగానే వాళ్లమీద ఆంక్షలు విధించాడు. వాళ్ల పనులు ఎక్కువ చేసి ఎక్కువగా ఉన్న వారిని తీసివేశాడు.

ఒక రోజు ఇంట్లో శర్మ ఎవరిమీదనో పెద్ద గొంతుతో అరుస్తూంటే చదువుతున్న పుస్తకం అవతలపెట్టి లోపలికి వెళ్లింది సావిత్రి—

"నువ్వు తీయకపోతే మరెవరు తీస్తార్రా ఇడియట్. ఈ నక్క వినయాలు నాదగ్గరనా?" అంటూ వెడమీద చేత్తో ఒక్క దెబ్బ వేశాడు.

"అన్నయ్యా!" అని అరిచింది సావిత్రి పెద్దగా.

"చూడండమ్మగారూ, నేను దొంగతనం చేశానంట! నన్ను మీ రెరుగరా అమ్మా!" అంటూ ఏడిచాడు రాఘవులు.

రాఘవులంటే రామనాథం గారికి మంచి నమ్మకం. అతన్ని బంగారానికి కాపలా పెట్టినా భయుం లేదని సావిత్రి అనుభవం మీద గ్రహించింది కూడా.

"ఏం పోయిందన్నయ్యా?"

"ఉంగరం పోయింది చెల్లాయ్. నిన్న బాత్ రూంలో స్నానం చేస్తూ గూట్లో పెట్టాను. నాకు పీళ్ళ తోడింది ఈ వెధవే! వీడే తీసి ఉంటాడు" అన్నాడు శర్మ.

"ఉంగరమా?" ఆశ్చర్యంగా అడిగింది ఏదో జ్ఞప్తికి వచ్చి.

"అవును" అన్నాడు శర్మ.

కొంచెంసే పాగి "రాఘవులు అటువంటి పనులు చేయడన్నయ్యా. అతన్ని వదులు. రాఘవులూ, నువ్వు మరోలా అనుకోకు. వెళ్ళు" అంది సావిత్రి.

రాఘవులు వెళ్లిపోయాక శర్మ కోపంతో బుసలు కొడుతూ—"వాడి ఎదుట నన్ను వెధవ కింద కట్టేస్తే నా మీద వాళ్లకేమయినా గౌరవం ఉండాలా? ఈమేనేజిమెంటు నే చేయాలా ? అసలా పోయినాయనే వాళ్లను పాడుచేశాడంటే నువ్వు మరీ చనువిస్తున్నావు సావిత్రీ. కృష్ణారామా అనుకుంటూ కూర్చోక అనవసర విషయాల్లో కల్పించుకుంటా వెందుకు?" అన్నాడు.

"గౌరవం ఉండటం, ఉండకపోవటం అన్నది మన ప్రవర్తన మీదే ఉంటుందన్నయ్యా. నీ ఉంగరం నిన్న మనింట్లో ప్రయివేటు చెప్పే పంతులమ్మ దగ్గర చూశాను. నలుగురి కంటూ పడి అల్లరి పెట్టే వస్తువులు ఇక నుంచి ఆవిడకీయకు. వస్తువు ఒకరి కిచ్చి తప్పుకునేందుకు నింద ఇంకొకరి మీద మోపటం తెలివితక్కువతనం, అసహ్యం" అంది విసుగ్గా సావిత్రి.

శర్మ తెల్లబోయాడు.

ఆ పక్కగానే ఉండి సంభాషణ వింటున్న సరోజ "నే ననుకుంటున్నంతా అయిందన్నమాట. సిగ్గుండాలి. రానీయండి. దానిపని చెపుతా" అంది కోపంగా భర్తవంక చూస్తూ.

రాఘవులు మళ్లీ వచ్చి, "అమ్మగారూ, వాసుగారు వచ్చారండి" అన్నాడు.

"ఎవరాయన?" ఆశ్చర్యంగా అడిగింది సావిత్రి.

"మీ రెరుగరు గానండి, సానా మంచి వారండి. మన బాబుగారు ఒక్క అనాథ శరణాలయం పెట్టినారండి. దానిలో ఉంటారండి వాసుగారు. మీతో మాట్లాడాలంట!"

"నే వెడతాలే చెల్లాయ్" అన్నాడు శర్మ.

మాట్లాడకుండా పమిటచెంగు ఒంటి నిండా కప్పుకొని బయటికి వచ్చింది సావిత్రి.

హాలులో కూర్చుని ఉన్నా డతను. ఖద్దరు పంచె, ఖద్దరు లాల్చీ వేశాడు. చూడగానే అవతలివారిని ఆకర్షించే ముఖవర్చస్సుతో సింపుల్‌గా ఉన్నాడు.

"నమస్కారమండి. సావిత్రిగారంటే మీరేనా?" అన్నాడు లేచి నిలబడుతూ.

"అవునండి, కూర్చోండి" అని తను కూడా ఒక కుర్చీలో కూర్చుంది సావిత్రి.

వాసు ఆమెను నఖశిఖపర్యంతం ఒక్కసారి పరీక్షగా చూసి "రామనాథంగారు పోవడం నాకు చాలా విచారం కలిగించింది. పుట్టిన ప్రతివారూ పోక తప్పదని తెలిసినా మనకు కావలసినవారు పోయారంటే బాధ కలగటం సహజం. అందునా అంతటి సహృదయులు అరుదు" అన్నాడు


రామనాథంగారు పోయాక ఆయన మంచి గురించి హృదయపూర్వకంగా వచ్చిన మాటలు వినడం ఆమె కదే ప్రథమం. అలాగని ఆయన మంచివారు కాదని కాదు. ఆమె అన్నగారు, తండ్రి ఆయన బ్రతికి ఉన్నప్పుడు చేతులో డబ్బు ఉండికూడా లేదనేవాడని ఇప్పటికీ తిట్టుకుని నవ్వుకుంటూ ఉంటారు—"కట్టుకు పోయాడా" అని.

అందువలన తనకు గౌరవం ఉన్న ఒక వ్యక్తిని మరొకరు కూడా మెచ్చుకునేసరికి సావిత్రి కండ్లు చెమ్మగిల్లాయి. పైగా వాసు మీద సదభిప్రాయాన్ని కలిగించాయి ఆ మాటలు.

మళ్లీ అతనే ప్రారంభించాడు.

"రామనాథంగారి ప్రోత్సాహంవలన—ఆయనగారి సాయంతో ఒక అనాథ శరణాలయాన్ని ప్రారంభించామండి. దిక్కులేని పిల్లలు, ఆశ్రయంలేని ఆడవాళ్ళు ఉంటూంటారు అందులో. పిల్లలకు చదువు చెపుతాం. పెద్ద వాళ్లకు ఏమయినా వృత్తివిద్యలు నేర్పి వాళ్ళ తయారుచేసిన వస్తువులను బజారులో అమ్మిస్తూంటాము. రామనాథంగారు ఉండగా దీనిమీద చాలా శ్రద్ధ తీసుకునేవారు. ఇంకో వారం రోజుల్లో పోతారనగా నా కొక ఉత్తరం రాశారు ఆయన. అందులో చాలా ముఖ్య విషయాలు రాశారు. వాటిల్లో ఒకటి శరణాలయం గురించి. చదువుతాను వినండి.... 'నేను పోయాననిచెప్పి ఆశ్రమాన్ని మూసేయకండి. దానికి కావలసిన సాయం మా సావిత్రి చేస్తుంది. ఆమెకు మనసు బాగుండనప్పుడు పిల్లలకు పాఠాలు కూడా చెబుతుంది. అలా చేయమని నే నామెకు చెప్పలేదు. చెప్ప నవసరం కూడా లేదు. సూర్యునకు వెలుగు ఇవ్వమని

(తరువాయి 41వ పేజీలో)



నటరాజు (వైదీశ్వరన్ కోయిల్)

ఫోటో—ఎన్. రామకృష్ణ (మాయురమ్)

# నవజీవనం

(20వ పేజీ తరువాయి)

ఒకరు చెప్పాలా?' అని రాశారు'' అని ఆగాడు వాసు.

తనపట్ల రామనాథంగారి కున్న ఉన్నతాభిప్రాయానికి మనస్సులోనే అంజలి ఘటించింది సావిత్రి.

''అనాథలను ఆదరించటం ఆయనకు ఇంటా బయటా కూడా అలవాటు. నేను, నా ద్వారా మావాళ్ళు—అంతా ఇప్పు డాయన చలవ వల్లనే బ్రతుకుతున్నాము'' అంది మెల్లగా.

''మీ రొకసారి మా ఆశ్రమానికి రావాలి.'' ప్రతిపాదించాడు వాసు.

''తప్పకుండా! ఇవ్వాళ కాదు కాని కొన్నిరోజుల్లో తప్పకుండా వస్తాను. ఇంతకూ ఈరోజు మీ కేదయినా....''

''ఇప్పట్లో ఏమీ అక్కరలేదండి. రామనాథంగారు పోయేముందే శరణాలయానికి కావలసిన 'నిధి' ఒకటి ఏర్పాటు చేశారు. పైగా మొన్న కొంత డబ్బుకూడా పంపించారు. వారు పోయిన రోజున వచ్చాను. మిమ్మ ల్నొకసారి కలుసుకుందామని వచ్చా నివ్వాళ. సెలవు'' అని నమస్కరించి వెళ్ళిపోయాడు.

''ఎంత కావాలిట ఈ దేశోద్ధారకుడికి?'' అన్నాడు లోపలికి వస్తూ శర్మ.

ఆలోచిస్తూ వాసు వెళ్ళిన వైపే చూస్తూ నిలబడిపోయిన సావిత్రి ఈ మాటలతో తేరుకుని అన్నగారివంక చూసింది.

''డబ్బున్నవాళ్ళు కనబడితేచాలు కప్పల్లాగా చేరతారు—చందాలు, శరణాలయాలు అంటూ. ఆక్కడికి మనం వీళ్ళకు ఇచ్చేందుకే పెట్టుకుని కూర్చున్నట్టు. అడ్డమయిన బేవారుసుగాళ్ళను చేరదీసిందికాక మనకు కూడా అంటిద్దామని చూశాడు'' అన్నాడు కోపంగా రామనాథంగారిని ఉద్దేశించి.

అతని మాటలకు సావిత్రికి అసహ్యం వేసింది. ''మనంకూడా అటువంటి వాళ్ళమేగా'' అందామనుకుని బలవంతాన ఆపుకుంది.

బూట్లు టకటక లాడించుకుంటూ మోటారుసైకిలుమీద వెళ్ళిపోతున్న అన్నగారి వంక చూస్తూ ''ఈ మోటారు సైకిళ్ళు, గాబర్డీను పాంట్లు, రాజభోగాలు అన్నీ ఆయన చలవ అన్నమాట వీళ్ళు ఒక్కసారి కూడా అనుకోరు'' అనుకుంది సావిత్రి. అంతలోనే ఇంకో విషయం కూడా గుర్తుకొచ్చింది. అది అన్నగారి ప్రవర్తన గురించిన వార్తలు. మనివాళ్ళవలన—అతని నడవడి ఏమీ బావుండటం లేదుని, వ్యాపారం పేరిట తీసుకుంటున్న డబ్బుపందులమ్మట తిరిగి తగలేస్తున్నాడని-వింది.

''మధ్యస్తంలో డబ్బు చేతినిండా వస్తే నీతి కూడా పోతుంది కాబోలు'' అనుకుంది.

''అమ్మాయ్ సావిత్రీ'' అన్న పిలుపుతో వెనక్కు తిరిగి ''ఏం నాన్నా?'' అంది.

''మన వసంతికి సంబంధం చూశానమ్మా'' అన్నా డాయన కుర్చీలో కూర్చుంటూ.

''ఏం చేస్తున్నాడు అబ్బాయి?''

''ఈ ఊళ్ళోనే ఇంజనీరింగ్ చదువుతున్నాడు. వాళ్ళది ఇక్కడికి దగ్గర పల్లెటూరు. రేపు చూసుకునేందుకు వస్తామన్నారు. అయితే కట్నం మట్టుకు కాస్త ఎక్కువే అడుగుతున్నారు'' అని ఆపేశాడు.

''ఎంత అడిగా రేమిటి?''

''పదిహేను వేలు! ఆస్తి నలభై ఎకరాలు ఉంది. ఒక్కడే కొడుకు.''

''అయితే అలాగే కానీయి నాన్నా, అన్ని విధాలా మంచి సంబంధాన్ని పోనీయట మెందుకు'' అనేసి గదిలోకి వెళ్ళిపోయింది సావిత్రి.

తన జీవితాన్ని నాశనం చేసుకుని తనవాళ్ళ భవిష్యత్తును బాగు చేసింది తను. కాని తనకోసం వీళ్ళలో ఎవరయినా బాధపడుతున్నారా? కనీసం తన గురించి ఆలోచిస్తున్నారా? వాళ్ళ దృష్టిలో తను చాలా అదృష్టవంతురాలు. లక్షల కధికారిణి! డబ్బుతప్ప వాళ్ళ కంటికి మరొకటి ఆనదు. కనీసం వాళ్ళు తమలోదాన్నిగా కూడా చూడకపోవడం ఆమెకు మరీ బాధ కలిగించింది. ఏదో అధికారితో మాట్లాడుతున్నట్లు తన అంగీకార ముద్రకోసం మాత్రమే తనతో సంప్రదిస్తున్నట్లు ఉంటాయి వాళ్ళ మాటలు! వాళ్ళలో వాళ్ళు ఒక నిర్ణయానికి వచ్చినాక తనకు చెపుతారు. ఏం—తను మాత్రం వారిలోది కాదూ? తనతోకూడా మనసిచ్చి ఎందుకు మాట్లాడరు? నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటున్నప్పుడు తను వెడితే ఠక్కున ఆపేస్తా రెందుకు?

సమాధానంలేని ఈ ప్రశ్నలతో, అంతులేని ఆలోచనలతో ఆమె తల వేడెక్కిపోయింది. టైము చూసుకుంది. సరిగా మూడు గంట లయింది. గబుక్కున లేచి చీర మార్చుకొని బయటికి వచ్చి ''రాఘవులూ'' అని కేక వేసింది.

''ఏమిటమ్మగారూ'' అంటూ పరుగెత్తుకు వచ్చాడు.

''అనాథ శరణాలయానికి వెడదాం పద'' అంది వరండా మెట్లు దిగుతూ. ఆమె తొందరకు ఆశ్చర్యపోతూ ''డ్రైవరును పిలుస్తా నుండండి అమ్మగారూ'' అన్నాడు ఖంగారుగా రాఘవులు.

''నడిచి వెడదాం పద'' అంటూ బయలు దేరింది. మాట్లాడకుండా అనుసరించా డతను.

చుట్టూ సరుగుడు చెట్లు, ఆకుపచ్చల కొబ్బరి చెట్లు, మధ్యగా పెంకు కప్పిన పెద్ద పాక లున్నాయి. చెట్లక్రింద కూర్చుని పిల్లలకు చదువు చెబుతున్న వాసు దూరంనుంచే సావిత్రిని గమనించి దిగ్గున లేచి ఎదురుగా వచ్చాడు.

''ఉదయం ఒక రోజు తప్పకుండా వస్తానంటే ఆ రోజు త్వరలో వస్తుందనే అనుకున్నాను. కాని ఈ రోజే అనుకోలేదండి! చాలా సంతోషం. మీవంటివారు శ్రద్ధ తీసుకుంటే ఇక ఈ ఆశ్రమం పైకి రావడం ఎంతసేపు!'' అన్నాడు నవ్వుతూ.

చుట్టూ కలయ చూసింది సావిత్రి. కూరగాయల మొక్కలు, పూల మొక్కలతో కలకలాడుతూంది అంతటా. ఆడవాళ్ళు ఆ మొక్కలకు దొరువులు చేసి ఇంజను తోడి పోస్తున్న నీళ్ళను వీటిలోకి మళ్ళిస్తున్నారు. చెట్లక్రింద పిల్లలు మాస్టారు ఎవరితోనో మాట్లాడుతున్నారన్న ధైర్యంతో గలగల అల్లరి చేస్తున్నారు.

ఆ వాతావరణం సావిత్రిని ముగ్ధురాలిని చేసింది. చెట్లమీద చిలకలు కూడా కనబడటంతో తను ముని ఆశ్రమానికి వచ్చానేమో అనుకుంది.

''పదండి, వాళ్ళ పాఠాలు చూద్దాం గాని'' అంటూ సావిత్రిని వాళ్ళ దగ్గరకు తీసుకుపోయాడు వాసు. ''అమ్మగారికి నమస్కారం పెట్టండి'' అన్నాడు పిల్లలతో.

అంతా ఒక్క గొంతుతో ''నమస్కారం'' అన్నారు. కాసేపు వాళ్ళచేత పాఠాలూ అవీ అప్పచెప్పించి తరువాత పూలమొక్కల వైపు బయలుదేరారు.

అక్కడున్న ఆడవాళ్ళు కొత్తగా వచ్చిన



తెలియని మనసు

చిత్రం — బి. ఎస్. స్వామి (శ్రీకాకుళం)

ఆమెను చూస్తూ నిలబడిపోయారు.

"ఈవిడ రామనాథంగారని మన ఆశ్రమం పెట్టినాయన భార్య—సావిత్రిగారు" అని వాళ్ళ కామెను పరిచయం చేశాడు.

ఇంతలో అక్కడికి ఇంకో పెద్ద మాస్టారొకాయన వచ్చాడు. సావిత్రి ఆ ఆడపిల్లలతో చనువుగా మాట్లాడి వాళ్ళ బెరుకు పోగొట్టింది. కాసేపు వాళ్ళ గత జీవితాల గురించి అడిగి తెలుసుకొని మనసులోనే బాధపడింది.

"ఇక్కడ మాత్రం మాకందరికీ చాలా హాయిగా ఉందండి. ఒకరిచేత మాట అనిపించుకోనవసరం లేదు. మాస్టారు కాసేపు మాకు చదువు చెపుతారు" అన్నారు వాళ్ళు.

చెట్లమీదనుంచి దింపించి కొబ్బరి బొండాలు కొట్టి ఇచ్చాడు వాసు సావిత్రికి. పొద్దు క్రుంకటంతో వారందరి దగ్గర సెలవు తీసుకొని బయలుదేరింది సావిత్రి. ఆమె మనస్సు కా వాతావరణం ఎంతో ప్రశాంతంగా, హాయిగా ఉంది. అందులో ఎక్కడా కృత్రిమత్వం లేదు. వీలయినప్పుడల్లా రావాలనుకొంది. అంతలోనే—

"చూడండి, కొందరిలో మనుష్యులను ఆకర్షించే శక్తి ఉంటుంది. మీరు వచ్చిన కాసేపటిలోనే వాళ్ళకందరికీ మీ దగ్గర చనువు ఏర్పడింది. నిజానికి ఇటువంటి అనాథ శరణాలయాల్లో మీలాగా ప్రేమతో పలుకరించే వారు కావాలి. పాపం వాళ్ళు అడిగారు— 'అమ్మగారు రోజూ వస్తారండి మాస్టారూ?' అని. 'వారికి వీలుంటే తప్పకుండా వస్తారు. కాని వారికి చాలా పను లుంటాయి' అన్నాను. వాళ్ళంతా చిన్నబుచ్చుకున్నారు" అన్నాడు వాసు.

"నేను కూడా రావాలనే అనుకుంటున్నానండి. కనీసం నా మనశ్శాంతికోసమయినా రోజూ వస్తాను—ఇదే వేళకు" అంది సావిత్రి.

వాసు ఎంతో ఆనందపడ్డాడు. "వాళ్ళకు కుట్టుపనులు నేర్పుదురుగాని" అన్నాడు.

ఆనాటినుంచి సావిత్రికి దైనందిన కార్యక్రమాల్లో ఇదొకటయిపోయింది. ఒక గంటసేపు ఏమయినా చెప్పటం, తరువాత ఆ చెట్లనీడనే కూర్చుని ఏదైనా విషయం మీద వాసుతో చర్చించడం. ఏ విషయంతో అయినా అతని విజ్ఞానం ఆమెను ఆశ్చర్యపరిచేది.

"మీరు శాంతినికేతన్‌లో ఎమ్. ఏ. పాసయి ఇక్కడ పనిచేస్తున్నారు కదా, మీకు వచ్చేది చాలుతుందా?" అనడిగింది సావిత్రి ఒకరోజు.

"చాలకపోవడం అనేది మన కోర్కెలమీద ఆధారపడి ఉంటుంది! నాకు నామీద ఆధారపడినవా రెవరూ లేరు. నన్ను చదివించింది కూడా రామనాథంగారే! వారే నన్నిక్కడ పెట్టారు. వారి మాటే నాకు ఆజ్ఞ. పైగా ఈ చిన్న పిల్లల సేవలో నాకు ఆనందం ఉంది; మనస్సంతృప్తి ఉంది" అన్నాడు ఆవేశంగా.

అతని వంక ఆశ్చర్యంగా చూసింది సావిత్రి.

# నవ జీవనం

రోజులు గడిచిపోతున్నాయి. ఆశ్రమానికి వెళ్ళడం, తరువాత వాసుతో మాట్లాడుతూ కొంత విజ్ఞానం సంపాదించుకోవడం ఆమె మనస్సుకు బాగున్నా అది ఇంట్లోవారికి నచ్చలేదు! అయినా ఆమె ఎదటపడి ఆమాట అనేందుకు సాహసించ లే దెవరూ.

వాసంతికి పెండ్లి వైభవంగా జరిపించింది సావిత్రి. ఎటూ అతను చదువుకోవలసింది ఆ ఊళ్ళోనే కాబట్టి వచ్చి తమ ఇంటిలోనే ఉండమని అతన్నికూడా ఇంట్లోకి చేర్చాడు సావిత్రి తండ్రి.

వయస్సులో ఉన్న ఒక అందమైన ఆడదాన్ని ముసలివాడికి కట్టబెట్టడం, ఆయన పోయాక ఆమె ఆదర్శాల పేరుతో ఒక యువకుడితో చనువుగా మాట్లాడి తిరగటం—ఇవి ఆమెపట్ల అపార్థాలకు తావిస్తాయి.

వసంత భర్త భాస్కరం ఇంట్లోకి ప్రవేశించిన వెంటనే ఆలోచనలన్నీ సావిత్రి వైపు కేంద్రీకరింపజేశాడు. తన భార్యకన్నా సావిత్రి చాలా అందమైనదన్న నగ్నసత్యం మొదటనే గుర్తించా డతను. అందుకే ఆమెను "వదినగారూ" అంటూ చనువుగా పిలుస్తూ ఆమెతో కాలేజి కబుర్లు, సినిమా విషయాలు చర్చించసాగాడు.

కల్మషంలేని ఆమె కంటికి అతని దురుద్దేశాలు తెలియ లేదు. తమ్ముడిలాంటి వాడన్న ఉద్దేశ్యంతో అతనితోసర దాగా మాట్లాడసాగింది. అది అతనికి మరీ ధైర్యాన్నిచ్చింది. చివరికి ఒక రోజు గదిలో కూర్చుని ఆమెతో మాటల సందర్భంలో సినిమాలు, సినిమాతారలు, వాళ్ళ అందాలు ప్రస్తావించి "వాళ్ళందరికన్నా అందమయిన దానివి నువ్వు సావిత్రీ— నీ కోసం తపస్సు చేస్తున్నాను" అంటూ ఆమె చేయి పుచ్చుకున్నాడు.

హడలిపోయింది సావిత్రి. తను నమ్ముకున్న భూమి బ్రద్దలవుతున్నట్లు అనిపించింది ఆమెకు. "ఛీ, ఛీ,పాడు మనుష్యులు—వదులు ముందు" అంటూ అతని చేతిని విదిలించుకోబోయింది.

కాని అతను పట్టు వదలలేదు. "వాసు కన్నా తీసిపోయానా" అన్నాడు హేళనగా నవ్వి. కొయ్యబారిపోయింది సావిత్రి.

సరిగా ఆ సమయానికి వసంత ఏదో పనుండి గదిలోకి వచ్చి లోపలిదృశ్యం చూసింది. ఆమె హృదయం భగ్గున మండిపోయింది. "ఆ వాసు మీద మోజు అయిపోయిందన్నమాట—ఇక నా కొంపకు ఎసరుపెట్టావు. సిగ్గుండాలి" అని రుసరుసలాడుతూ వెళ్ళిపోయింది. ఆమె వెనకనే బయటికి వెళ్ళిపోయాడు భాస్కరం.

రెండు చేతుల్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది సావిత్రి. ఆమె మనస్సంతా అల్లకల్లోలంగా ఉంది.

"ఏమిటి తను చేసిన పాపం? వీ రందరికోసం తనేదో త్యాగం చేశాననుకుని తన జీవితం నాశనం చేసుకుంది. ఎందుకు వీళ్ళంతా తన నిలా అపార్థం చేసుకుంటారు? ఒక మగాడితో చనువుగా మాట్లాడడం తప్పా? మగవాడి రక్షణలేని ఆడది అందరికీ చులకనేనా?" తలగడ అంతా తడిసేదాకా ఏడ్చింది.

దీపాలు పెట్టేవేళకు లేచి కిందకు వచ్చింది. తల పగిలిపోతూంది. బాత్‌రూంలో ఒకసారి చల్లటి నీళ్ళకింద తల పెడదామని గబగబ బాత్‌రూంకేసి వెళ్ళింది. వసంత, సరోజ హాల్లో కూర్చుని మాట్లాడుకుంటూ ఆమెరాక చూసి తక్కువ మాట లాపేశారు. వసంత ఏడ్చినట్టుంది—కళ్ళు, ముక్కు ఎర్రబడి ఉన్నాయి. "బహుశా నేను తన భర్తను వలలో వేసుకున్నానని చెప్పుకొని ఏడ్చింది కాబోలు" అని బాధగా అనుకుంది సావిత్రి మనసులో.

బాత్‌రూంలోకి వెడుతూంటే తనకు వినబడాలనే "ఎంతమంది కొంపలు కూల్చిందే వెధవ జీవితాలు వెళ్ళ మారుతాయి—బయట వాళ్ళను ఉద్ధరించింది చాలక ఇంట్లోతోడబుట్టిన వాళ్ళకే ఎసరు పెడతారు" అని కసిగా సరోజ అనడం వినబడి గబుక్కున లోపలికి వెళ్ళి బాణాల్లాంటి ఆ మాటలు వినబడకుండా తలుపులు గట్టిగా బిగించి వాటికి ఆనుకుంది.

"తను చేయని పాపానికి ఎందుకు తన కీ శిక్ష? సాటి ఆడదాని స్థితిని సానుభూతితో అర్థం చేసుకోకపోగా పిచ్చి కుక్కను తరిమినట్టు మాటల్తో చంపుతూ ఆనందిస్తా రెందుకు?"

షవర్‌బాత్ పూర్తిగా తిప్పేసి దానిక్రింద కూర్చుంది. వేడెక్కిపోయిన శరీరంమీద చల్లటినీళ్ళు పడి శరీరానికి హాయినిచ్చాయి. అలా పది నిమిషాలు అచేతనంగా ఉండిపోయింది. అప్పటికి ఆమె మనస్సు కూడా కొంచెం చల్లబడింది.

"రాకూడని అపవాదు ఎటూ రానేవచ్చింది.

## ఇహ పరాలు

డాక్టర్ (రోగితో): "మీకు ఈ లోకంలో శత్రువులు అధికం."

రోగి: "అవునండి, పరలోకంలో ఇంకా ఎక్కువ."

—మాస్టర్ రవి
(రాజాం)

తను తన జీవితాన్ని ఇప్పటికయినా బాగు చేసుకుంటే ఏం? ఎవరడ్డం వస్తారు?'' అన్న ఊహ కలిగింది హఠాత్తుగా.

ఏదో రాకూడని ఆలోచన వచ్చినట్టు నిలువునా వణికిపోయింది. అంతలో రామనాథం గారి మాటలు గుర్తుకు వచ్చాయి: "నాకు నువ్వొక వాగ్దానం చేయాలి. మంచివాడు, ఉత్తమ ఆదర్శాలు కలవాడు తటస్థపడితే అతన్ని నువ్వు వివాహమాడతానని! లేకపోతే నా మనస్సుకు శాంతి ఉండదు."

మరుక్షణంలో ఆమె మనస్సులో వాసు రూపం ప్రత్యక్షమయింది. లేచి ఉత్సాహంతో స్నానంపూర్తి చేసి బయటికి వచ్చింది. ఆమెకోసమే ఎదురుచూస్తున్న రాఘవులు "మీకోసం వాసు బాబు వచ్చి కూర్చున్నారమ్మగారూ'' అన్నాడు.

ఎన్నడూ లేనిది ఎందుకో సిగ్గు పడిపోయింది సావిత్రి. "తోటలో కూర్చోమను—ఇప్పుడే వస్తాను'' అని పైకి వెళ్ళింది. అనుకోకుండానే గదిలోని కిటికీలోంచి తోటలోకి చూసింది. వెన్నెలో మహానందంతో స్నానం చేస్తున్నాయి పూలమొక్కలు. ఆ మొక్కల మధ్య నిలబడి ఉన్నాడు వాసు!

"మంచివాడు, ఉత్తమ ఆదర్శాలు కలవాడు'' అనుకుని "పైగా అందమైన వాడు. తనను రెండోవివాహానికి అంగీకరిస్తాడా?'' అన్న ఆలోచన కలిగి గతుక్కుమంది సావిత్రి.

బట్టలు మార్చుకుని తోటలోకి వెళ్ళింది.

"ఇవ్వాళ మీరు మా శరణాలయానికి రాలేదు?'' 'అన్నాడు వాసు ఎందువలన అన్నట్టుగా.

అతనివంక సూటిగా చూడలేకపోయింది సావిత్రి. తల వంచుకొని నేలమీద కాలి బొటనవేలుతో రాస్తూ "అవునండీ, నిద్ర పోయాను. లేచేసరికి ఈవేళయింది'' అంది.

వాసుకూడా ఏదో ఆలోచనల్లో మునిగి తేలుతున్నాడు. "మీతో నాకు పరిచయమయి ఆర్నెల్లయింది'' అన్నాడు.

హఠాత్తుగా అటువంటి ప్రస్తావనకు ఆశ్చర్యపోయి అతని వంక చూసింది సావిత్రి.


అతను ఏదో చెబుదామని నోరు తెరిచేంతలో మంత్ర, సరోజ అటురావడం చూసి ఆపేశాడు. సావిత్రి కూడా తేలిగ్గా నిట్టూర్చి "ఏం వదినా ఇటొచ్చారు?'' అంది—జరిగినవన్నీ మరిచిపోదామన్న ప్రయత్నంలో.

"రాకూడదని తెలియక వచ్చాంలే వమ్మా. పొరపాటయింది—పోతున్నాం'' అంది సరోజ వెళ్ళున.

"బాగా అన్నావు'' అన్నట్టు ప్రశంసా పూర్వకంగా నవ్వింది వాసంతి. ఇద్దరూ నవ్వుకుంటూ వెళ్లిపోయారు.

సావిత్రి అవమానంతో ముఖం చిన్న బుచ్చుకుని తల దించేసుకుంది.

"మీ కో విషయం చెప్పాలని కొన్ని



చిత్రం—గీత (విజయవాడ-1)

రోజులుగా చూస్తున్నాను సావిత్రీ—మీరు మరోలా అనుకోకపోతే'' అని కాసేపాగి, "ఆడదానికి, అందులోనూ అందంగా ఉండి వయస్సులో ఉంటే, ఒంటరిగా ఉంటే రక్షణ లేకపోగా అపవాదులు కూడా వస్తాయి. మనం నిప్పులాంటి వారమే కావచ్చు. కాని మనవాళ్లే మనలను అపార్థం చేసుకుంటారు. దానికి వారిమీద కోప్పడి కూడా ప్రయోజనం లేదు. ఎందుకంటే లోకంతీరే అంత. మనం వాళ్ళ స్థానంలో ఉంటే మనం కూడా అంతేనేమో? ఇందాక మీ మరిది మిమ్మల్ని సరిగా అర్థం చేసుకోలేక మీమీద అత్యాచారం చేయబోయాట్ట—రాఘవులు చెప్పాడు. కాని ఆ పరిస్థితుల్లో మీమాట ఎవరూ నమ్మరు. మీ చెల్లెలి ప్రచారం నమ్ముతారు. సానుభూతి కూడా ఆమెమీదే ఉంటుంది. మీకు వయస్సు సుమారు పాతిక ఉంటుందనుకుంటా. కాబట్టి మీరు మళ్ళీ వివాహం గురించి ఆలోచించటం మంచిదని నా అభిప్రాయం'' అన్నాడు.

తన మనస్సులో అనుకున్న మాటలను అతను తనతోనే అంటూంటే ఆమె అతని వంక చూసింది.

"మీకు అభ్యంతరం లేకపోతే నా కే ఆ అదృష్టం కలిగించమని కూడా కోరుతున్నాను. నే నేదో సంస్కర్తనని నలుగురిలో గొప్ప చెప్పుకునేందుకు మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటా నన్నానని అనుకోకండి. మీలాంటివారిని పొందడం అదృష్టం. మీకున్న మనస్సు చాలా కొద్ది మందికి ఉంటుంది."

సావిత్రి ఏదో బరువు తొలగినట్లు తృప్తిగా నిట్టూర్చింది.

"ఏమంటారు—నాకా భాగ్యం కలిగిస్తారా?'' అన్నాడు వాసు.

సావిత్రి బుగ్గలు సిగ్గుతో ఎరుపెక్కాయి. "అదృష్టవంతురాలిని నేను'' అంది తలవంచుకుని.

"మన కీ అదృష్టాన్ని కలుగచేసింది రామనాథం గారే! ఈ ఉత్తరం చదువు సావిత్రీ'' అంటూ జేబులోంచి ఉత్తరం తీసి "ఈ పారాగ్రాఫ్'' అని ఆమె కిచ్చాడు.

సావిత్రి చదివింది.

"నువ్వు మంచి ఆదర్శాలు కలవాడవని నాకు నమ్మకముంది. అందుకనే నే నొక విచిత్రమయిన కోరిక కోరుతున్నాను. నా భార్య పేరు సావిత్రి. నా కూతురుకు ఉండవలసిన వయస్సామెది. ఆమె జీవితం నాశనం చేశాను. నువ్వు సావిత్రితో పరిచయం చేసుకో. ఆమె హృదయం నవనీతం వంటిది. కుటుంబంకోసం త్యాగం చేశాననుకుని ఆ స్వార్థపరులకోసం బలి అయేందుకు సిద్ధంగా ఉంది. ఆమె మనస్సు నీకు అనుభవం మీద అర్థమవుతుంది. ఆమె నీకు నచ్చి నిన్నామె వివాహం చేసుకునేందుకు అంగీకరిస్తే నీ అంత అదృష్టవంతుడు మరొకడు లేడు!

అయితే ఒక విషయం. పైన చెప్పినది ఒక సలహా లాంటిది. నీ మనస్సుకు నచ్చకుండా నా కోసం చేసుకుంటే మట్టుకు నాకు తీరని ద్రోహం చేసినవా డవుతావు'' అని ఉంది.

"చూశావా సావిత్రీ, రామనాథంగారి దృష్టిలో కూడా అదృష్టవంతుడిని నేనే!'' అంటూ హాయిగా నవ్వాడు వాసు.

సావిత్రి కండ్లు ఆర్ద్రమయాయి. ఆ ఉత్తరాన్ని కండ్లకద్దుకుని "వారు నా కిచ్చిన ఆస్తినంతటనీ అనాథశరణాలయానికి రాసేద్దాం'' అంది ఒక నిర్ణయానికి వచ్చినట్లు.

"మరి మీ వాళ్ళేమవుతారు?'' అడిగాడు వాసు.

"డబ్బు విలువ తెలియాలంటే ప్రతివారూ కష్టపడాలి. మా కుటుంబం కూడా ఆర్థికంగా బాగుపడింది. వాళ్ళ రెక్కలమీద వారిని ఆధార పడనివ్వండి. ఇప్పటికే వారికి చాలా ఋణపడి ఉన్నాను. మావాళ్ళకు ఉండే ఇల్లు మట్టుకు వదిలి మిగిలినదంతా శరణాలయానికి రాసి మనిద్దరం అనాథలసేవ చేస్తూ అందులోనే కాలం గడుపుదాం'' అంది సావిత్రి.

"నీ ఇష్టం'' అన్నాడు వాసు ఆమె నిర్ణయాన్ని మనస్సులోనే అభినందిస్తూ.

రామనాథంగారు వారి కలయికకు ఆనంద పడినట్టుగా చెట్లఆకులనుంచి రెండు మంచు బిందువులు రాలాయి వారిమీద. ★